ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 16 మే 2025 www.prajaswaramdaily.com


# సుప్రీంకోర్టు డెడ్‌లైన్ పెట్టొచ్చా?

## రాష్ట్రపతి ప్రశ్న
## రాజ్యాంగంలో నిబంధనేదీ లేనప్పుడు కోర్టు తీర్పు ఎలా ?




న్యూఢిల్లీ : గవర్నర్లు పంపే బిల్లులపై రాష్ట్రపతికి నిర్దిష్ట టైమ్ లైన్ విధిస్తూ ఇటీవలే సుప్రీం కోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తాజాగా స్పందించారు. ఈ మేరకు రాష్ట్రపతి, గవర్నర్‌కు సుప్రీంకోర్టు డెడ్‌లైన్ పెట్టొచ్చా..? అని ప్రశ్నించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు కోర్టు తీర్పు ఎలా ఇచ్చిందన్నారు.
'రాజ్యాంగంలోని రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు..? సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు.. కేంద్రానికి వ్యతిరేకంగా దుర్వినియోగం చేస్తున్నాయా?' వంటి రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద పలు ప్రశ్నలు వేసినట్లు ఇండియా టుడే నివేదించింది. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది.

**రాష్ట్రపతి అడిగిన ప్రశ్నలు ఇవే..**

రాష్ట్రపతి, గవర్నర్‌కు కోర్టులు గడువు ఎలా నిర్దేశిస్తాయి?
రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 కింద బిల్లును సమర్పించినప్పుడు గవర్నర్ ముందున్న రాజ్యాంగపరమైన ఎంపికలేంటి?
రాజ్యాంగంలోని రాష్ట్రపతి లేదా గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు తన సొంత అధికారాలతో ఎలా భర్తీ చేయగలదు?
సుప్రీంకోర్టుకు ఉన్న ప్లీనరీ అధికారాలను రాష్ట్రాలు కేంద్రానికి
రాజ్యాంగంలోని 361వ అధికరణం, 200వ అధికరణం కింద గవర్నర్ చర్యలకు సంబంధించి న్యాయ సమీక్షపై పూర్తి నిషేధం విధిస్తుందా?
ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి, ఆర్టికల్ 200 కింద గవర్నర్ రాజ్యాంగ విచక్షణాధికారం ఉపయోగించడం న్యాయబద్ధమేనా?
రాజ్యాంగంలో రాష్ట్రపతి అధికారాల మేరకు ఆర్టికల్ 143 కింద సుప్రీం కోర్టు సలహాను పొందడానికి లేదా గవర్నర్, రాష్ట్రపతి అనుమతి కోసం బిల్లును రిజర్వ్ చేయడం లేదా ఇతర విధంగా సుప్రీంకోర్టు అభిప్రాయం పొందడం అవసరమా?

# సీఎస్ సహా కార్యదర్శులు జైలుకే..



**కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై**

**సుప్రీం సీరియస్**

**నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలు చెప్పాలన్న ఉన్నత న్యాయస్థానం**

హైదరాబాద్ : హైదరాబాద్ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలని న్యాయస్థానం పేర్కొంది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు ఏమాత్రం విరుద్ధంగా వ్యవహరించినా ఊరుకునేది లేదని ధర్మాసనం హెచ్చరించింది. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇక, కేంద్ర సాధికారిక సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సమయం కోరారు. విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

# ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం

**గురు గోవింద్ సింగ్ కాలేజీ గ్రంథాలయంలో మంటలు**

**11 ఫైరింజన్లతో మంటలార్పిన సిబ్బంది**

**ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు వెల్లడి**

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని పీతంపుర ప్రాంతంలో ఉన్న శ్రీ గురు గోవింద్ సింగ్ (జీజీఎస్) కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో గురువారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో పెద్దెత్తున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే 11 అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించాయి. అగ్నిమాపక సిబ్బంది సత్వర స్పందనతో ఉదయం 9:40 గంటల సమయానికి మంటలు అదుపులోకి వచ్చినట్లు డీఎఫ్ఎస్ అధికారులు వెల్లడించారు. తొలుత కాలేజీలోని మొదటి అంతస్తులో మంటలు చెలరేగాయని, ఆ తర్వాత అవి వేగంగా రెండో, మూడో అంతస్తులకు కూడా వ్యాపించాయి. దట్టమైన పొగలు, భారీ అగ్నికీలలు కనిపించాయి. ప్రమాద తీవ్రత దృష్ట్యా అధికారులు చుట్టుపక్కల ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టారు. మంటలు పూర్తిగా చల్లారిన తర్వాత నష్టంపై పూర్తిస్థాయి అంచనా వేయనున్నట్లు అధికారులు వివరించారు. ఈ ప్రమాదం జరగడం, కళాశాల పూర్తిస్థాయిలో విద్యార్థులతో నిండిపోక ముందే ఘటన చోటుచేసుకోవడంతో పెను ప్రమాదం తప్పిందని భావిస్తున్నారు. అగ్ని



ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు స్పష్టం చేశారు.


# ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పాలి

**కల్నల్ సోఫియా ఖురేషిపై మంత్రి అనుచిత వ్యాఖ్యలు**

**హైకోర్టు ఆదేశాలతో ఆయనపై కేసు**

**దీనిపై సుప్రీంను ఆశ్రయించిన మంత్రి**

**తప్పుపట్టిన ఉన్నత న్యాయస్థానం**



భోపాల్ : భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తల నేపథ్యంలో భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి మీడియాకు వివరాలు వెల్లడించిన సైనికాధికారి కల్నల్ సోఫియా ఖురేషీని ఉద్దేశిస్తూ మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షా అనుచిత వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడిపై స్పందిస్తూ మాట్లాడిన ఆయన ఉగ్రవాదులు మన సోదరీ మణుల సిందూరాన్ని తుడిచేసి వితంతువుల్ని చేశారని, వాళ్ల మతానికి చెందిన సోదరిని ప్రధాని మోదీ సైనిక విమానంలో పాక్‌కు పంపించి పాఠం నేర్పించారని అన్నారు. ఖురేషీని ఉద్దేశిస్తూ విజయ్ షా చేసిన ఈ వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా తీవ్ర దుమారాన్ని రేపాయి.
హైకోర్టు ఆదేశాలతో ఆయనపై కేసు కూడా నమోదైంది. తాజాగా ఈ వ్యవహారం సుప్రీం కోర్టుకు చేరింది. హైకోర్టు ఆదేశాలపై మంత్రి విజయ్ షా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, మంత్రి పిటిషన్‌ను రేపు (శుక్రవారం) విచారించేందుకు అంగీకరించిన కోర్టు... ఆయన తీరును తప్పుపట్టింది. "ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారు. ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండి. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించండి" అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ కూడా మండిపడిన విషయం తెలిసిందే.

# హీరో బెల్లంకొండ శ్రీనివాస్‌పై కేసు



హైదరాబాద్: హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పై కేసు నమోదు అయింది. జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టుల కాలనీలో నివాసం ఉంటున్న ఆయన ఇంటికి వెళ్తున్న సమయంలో అపసవ్య దిశలో కారు నడిపినట్లు పోలీసులు గుర్తించారు. తనని అడ్డుకున్న ట్రాఫిక్ పోలీసుతో ఆయన దురుసుగా ప్రవర్తించారు. దీంతో తాజాగా ఆయనపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది.

# రూ. 8వేల కోట్ల 'ఫీజు' బకాయిలు వెంటనే చెల్లించాలి

**సీఎంకు బండి సంజయ్ లేఖ**



హైదరాబాద్: తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. "ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి"అని లేఖలో పేర్కొన్నారు.

# పుల్వామాలో కాల్పుల మోత.. ఉగ్రవాది హతం

**అవంతిపురాలో భద్రతా దళాల ఆపరేషన్ సక్సెస్**

కశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు ఒక ఉగ్రవాదిని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. దక్షిణ కశ్మీర్‌లోని అవంతిపురా పరిధిలోని నాదేర్ త్రాల్ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న నిఘా సమాచారం భద్రతా దళాలకు అందింది. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు గురువారం తెల్లవారుజామున ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి నిర్బంధ తనిఖీ ఆపరేషన్ ప్రారంభించాయి. ఒకచోట దాక్కున్న ఉగ్రవాదులు ఒక్కసారిగా భద్రతా సిబ్బందిపై కాల్పులకు తెగబడ్డారు. అప్రమత్తమైన భద్రతా దళాలు ప్రతిగా కాల్పులు జరిపాయి. ఇరువర్గాల మధ్య కొంతసేపు భీకరంగా కాల్పులు కొనసాగాయి. ఒక ఉగ్రవాది హతమైనట్లు సమాచారం. మరో ఇద్దరు, ముగ్గురు ఉగ్రవాదులు చిక్కినట్లు తెలిసింది. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని, మిగిలిన ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.



# కాచిగూడ రైలులో మంటలు

**బీబీనగర్‌లో నిలిపివేత**

బీబీనగర్ : బీబీనగర్ వద్ద కాచిగూడ రైలులో మంటలు చెలరేగాయి. మిర్యాలగూడ నుంచి కాచిగూడకు వెళ్తున్న సమయంలో భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామాన్ని దాటుతున్న సమయంలో పొగలు వచ్చాయి. రైలు కింది భాగంలో మంటలు చెలరేగాయి. గమనించిన ప్రయాణికులు వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. దాంతో రైలును బీబీనగర్ స్టేషన్‌లో నిలిపివేశారు. ఫైరింజన్ సహాయంతో మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. ఎవరికీ ఎలాంటి అపాయం జరగలేదని అధికారులు తెలిపారు. రైలు నిలిపేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

